
7

సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం। 27। మే। 2025



సోమశిలలో 43.960 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో 43.960 టీఎంసీల నీరుంది. పైతట్టు ప్రాంతాల నుంచి 972 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. 95.061 మీటర్ల నీటిమట్టం నమోదయింది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.99,250
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.8,950
3శాతం జీఎస్టీతో	రూ.9,218
నవర (8గ్రా)	రూ.73,744

గరిష్టం/కనిష్టం
35.2 /27.2

వాతావరణం
జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 63 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

మంత్రి హామీతో సమ్మె విరమణ

- డీఎంహెచ్‌ఓకు సీహెచ్‌ఓల వినతి పత్రం



డీఎంహెచ్‌ఓ సుజాతకు వినతిపత్రం ఇస్తున్న సీహెచ్‌ఓ అసోసియేషన్ నాయకులు

నెల్లూరు (అర్బన్): తమ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వైద్యశాఖ మంత్రి హామీ ఇవ్వడంతో తాము చేస్తున్న సమ్మెను విరమించి తక్షణమే విధుల్లోకి చేరుతున్నామని సీహెచ్‌ఓలు తెలిపారు. సోమవారం డీఎంహెచ్‌ఓ సుజాతకు సీహెచ్‌ఓ అసోసియేషన్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్ మాట్లాడుతూ తమ సంఘ రాష్ట్ర నాయకులు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌తో పలు అంశాలపై చర్చించారన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, సమ్మెను విరమించాలని కోరారన్నారు. దీంతో తాము సమ్మెను విరమిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రుబేకా, జిల్లా కోఆర్డినేటర్ ఆదిల్, నాయకులు, జ్యోతి, సుమాంజలి, హెప్సిబా, నవీన్, హనుమానాయక్, కోశాధికారి అనూష తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడుతున్నా.. ఆగని రవాణా



అధికారులు స్వాధీనం చేసుకున్న భారీ వాహనం

సంగం: చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా ఆగడం లేదు. వారం రోజుల వ్యవధిలో సుమారు 500కు పైగా చికెన్ వేస్ట్ ఉన్న డ్రమ్ములను అధికారులు పట్టుకున్నారు. తాజాగా సోమవారం సుమారు 80 డ్రమ్ముల చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని సంగం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ వాహనంలోని చికెన్ వేస్ట్‌ను సమీపంలోని కొండ ప్రాంతం వద్దే భారీ గుంత తీసి పూడ్చివేశారు. వాహనం డ్రైవర్, యజమానిపై కేసులు నమోదు చేశారు. ఇలా ప్రతి నిత్యం వాహనాలను పట్టుకుంటున్న అధికారులు అసలు అవి ఎక్కడి నుంచి వస్తున్నాయో, ఎక్కడికి వెళ్తున్నాయో తెలుసుకుని వారిపై కూడా చర్యలు తీసుకుంటే రవాణా ఆగిపోతుందని ప్రజలు భావిస్తున్నారు.

మై భారత్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోండి

నెల్లూరు రూరల్: యువతకు సాధికారత కల్పించడం, వారి అభివృద్ధి, దేశ నిర్మాణానికి తోడ్పడానికి అవకాశాలు, వనరులు పొందడానికి కేంద్ర, రాష్ట్ర యువజన వ్యవహారాల శాఖ యువత మైభారత్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సెట్నెల్ సీఈఓ ఏ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడంలో ప్రధాన లక్ష్యం యువత ఆలోచనలు, అభిప్రాయాలను, సూచనలను వ్యక్తిగతంగా, సమష్టిగా తెలుసుకోవడం, సమాజాభివృద్ధిలో యువత పాత్రను పంచుకోవాలన్నారు. జిల్లాలోని యువతీ, యువకులు ఎక్కువ సంఖ్యలో తమ పేర్లను పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

జిల్లాలో మోస్తరు వర్షాలు



నెల్లూరు (అర్బన్): జిల్లాలో ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు కొన్ని చోట్ల భారీవర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. అత్యధికంగా దుత్తలూరు మండలంలో 43.6 మి.మీ. వర్షం కురిసింది. నెల్లూరు అర్బన్‌లో అత్యల్పంగా 1.4 మి.మీ. కురిసింది. కొండాపురం 37.6 మి.మీ., లింగసముద్రం 33.0, గుడ్లూరు 24.2, సైదాపురం 20.4, ఉదయగిరి 20.4, రాపూరు 19.6, వెంకటాచలం 18.4, తోటపల్లిగూడూరు 17.8, వలేటివారిపాళెం 17.4, పొదలకూరు 17.4, వరికుంటపాడు 15.4, జలదంకి 14.2, వింజమూరు 12.8, కందుకూరు 12.4, ఉలవపాడు 12.2, మర్రిపాడు 12.2, దగదర్తి 11.8, కలిగిరి 10.6, మనుబోలు 10.4, ముత్తుకూరు 10.2, ఆత్మకూరు 9.2, కావలి 8.6, అనుమసముద్రంపేట 8.4, అనంతసాగరం 8.2, ఇందుకూరుపేట 7.4, కలువాయి 7.2, నెల్లూరు రూరల్ 2.6, చేజర్ల 2.4, సీతారామపురం 2.0 మి.మీ. మేర వర్షం కురిసింది.

ప్రశ్నించే గళానికి సంకెళ్లు

మాజీ మంత్రి కాకాణిపై రెడ్‌బుక్ రాజ్యాంగం

- అక్రమ కేసులతో జైలుకు
- కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆయనపై ఎనిమిది కేసులు నమోదు
- ఇదే కేసులో టీడీపీ నేత ఏ5 నిందితుడైనా అరెస్టులుండవు!
- కూటమి పాలనపై పెల్లుబుకుతున్న ప్రజాగ్రహం



వైఎస్సార్‌సీపీలో కీలక నేతలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. తాజాగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి రెడ్‌బుక్ సంకెళ్లు వేసింది. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, మోసాలను, సర్వేపల్లి ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలను అనునిత్యం ప్రశ్నిస్తుండడంతో ఓర్చుకోలేని అధికార పార్టీ పెద్దలు పెట్టించిన కుట్ర కేసులతో ఆయన్ను జైలుకు పంపించింది. అసలు అక్రమ మైనింగే జరగలేదంటూ నివేదిక ఇచ్చిన అధికారితోనే తప్పుడు ఫిర్యాదు చేయించడంతో పాలకుల దాష్టీకాలు పరాకాష్టకు చేరాయి. ఇదే కేసులో ఆ తర్వాత నిందితుడిగా ఉన్న టీడీపీ నేతను అరెస్ట్ నుంచి మినహాయించడం విమర్శలకు దారితీస్తోంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో రెడ్‌బుక్ రాజ్యాంగం కుట్రలు పరాకాష్టకు చేరాయి. మాజీ ప్రజా ప్రతినిధులే లక్ష్యంగా ప్రభుత్వ పెద్దల డైరెక్షన్‌లో అధికార యంత్రాంగం తప్పుడు కేసులు బనాయిస్తూ రాజ్యాంగ పరమైన న్యాయ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారు. అధికారులు వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేస్తూ అక్రమ కేసుల్లో ఇరికిస్తున్నారు. తప్పుడు కేసులు పెట్టిన అధికారులు, పోలీసులు ప్రభుత్వ మారితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని తెలిసినా జీ హుజూర్ అంటున్నారు. పొదలకూరు మండలంలోని తాటిపర్తిలో ఉన్న రుస్తుం మైన్స్‌లో అక్రమ మైనింగ్ జరగలేదని నిర్ధారించి నివేదిక ఇచ్చిన ఆ శాఖ అధికారులే ప్రభుత్వం మారిన ఎనిమిది నెలలకు అక్రమ మైనింగ్ జరిగిందంటూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని జైలుకు పంపడంపై ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది.

రెడ్‌బుక్ కుట్రతోనే కాకాణిపై కేసు నమోదు

కూటమి పాలకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించడం, ప్రభుత్వ వైఫల్యాలను, మోసాలను, ప్రజా వ్యతిరేక విధానాలతోపాటు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇసుక, మద్యం, గ్రావెల్, బూడిద, ఇరిగేషన్ పను ల్లో అవినీతి, అక్రమాలను నిత్యం ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి, ప్రస్తుత ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని టార్గెట్ చేసి అక్రమ కేసుల్లో ఇరికించేందుకు కుట్రలకు తెరతీశారు. రుస్తుం మైన్స్‌లో అక్రమ మైనింగ్ జరిగిందంటూ అందులో పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, వాకాటి శివారెడ్డి, వాకాటి శ్రీనివాసులరెడ్డి ప్రమేయం ఉందని మైనింగ్ డీడీ బాలాజీనాయక్‌తో మైనింగ్ అధికారులు కూటమి అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల తర్వాత పొదలకూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. అయితే ఆ ముగ్గురికి న్యాయస్థానంలో ముందస్తు బెయిల్ ఇచ్చింది. దీంతో కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కూడా ఈజీగా బెయిల్ వస్తుందని భావించి అధికార పార్టీ పెద్దలు తమ కుట్రలకు పదను పెట్టారు. కాకాణితోపాటు మరో ఆరుగురిని చేరుస్తూ, నాన్‌బెయిలబుల్ సెక్షన్లు యాడ్ చేసి ఇంప్లీడ్ మెమో దాఖలు చేశారు.

టీడీపీ నేతలకు అరెస్టులుండవా

రుస్తుం మైనింగ్ కేసులో ఏ–5 గా ఉన్న గుంటమడుగు కృష్ణంరాజు టీడీపీ నేతలతో కలిసి జిల్లాలోనే తిరుగుతూ పోలీస్ శాఖకు దమ్ముంటే అరెస్ట్ చేయండి చూద్దామంటూ సవాల్ విసురుతున్నాడు. సైదాపురం మండల టీడీపీ మాజీ అధ్యక్షుడిగా ఉన్న కృష్ణం రాజు మైనింగ్ వ్యాపారంలో దిట్ట. ఒకప్పుడు సామాన్య వ్యక్తిగా ఉన్న ఆయన ప్రస్తుతం రూ.వందల కోట్లకు ఆస్తిపరుడు.ఆయన టీడీపీ నేతగా ఉండడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విశ్వరూపం చూపించాడు. అనధికార మైనింగ్‌తో చెలరేగిపోయాడు. ఇది కూటమి సిండికేట్‌కు నచ్చకపోవడంతో కేసులో నిందితుడిగా చేర్చి ఆయన దూకుడుకు క్లాంప్ వేయించారు. ఈ కేసును అడ్డం పెట్టుకుని మైకా క్వార్ట్జ్ ఎక్స్‌పోర్టర్‌గా విదేశీయులతో ఉన్న పరిచయాలు, ఆయన వ్యాపార అనుభవాన్ని వాడుకుని తమ కార్యకలాపాలు చక్కబెట్టుకుంటున్నారు.

డీటీసీలో రహస్య విచారణ

కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆదివారం కర్ణాటక రాష్ట్రం చింతామణి వెంకటాపురంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రాత్రి సుమారు 9.30 గంటలకు వెంకటాచలం మండలం చెముడుగుంటలోని డీటీసీకి తీసుకువచ్చారు. అక్కడ కాకాణిని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు విచారించారు. రాత్రి 11.45 గంటల ప్రాంతంలో అరెస్ట్ చూపించి కాకాణి వద్ద నున్న రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం తెల్లవారు జామున వైద్య పరీక్షల నిమిత్తం వెంకటాచలంలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం తిరిగి డీటీసీకి తీసుకువచ్చారు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రత నడుమ కోర్టుకు తరలించారు.

కాకాణి అరెస్ట్ అప్రజాస్వామికం



నాయుడుపేట టౌన్: కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించడమే కాకుండా అట్రాసిటీ కేసులు పెట్టడం అప్రజాస్వామికం. కూటమి అక్ర మ కేసులకు భయపడేది లేదు. కాకాణికి మేమంతా అండగా ఉంటాం. కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది.

– కిలివేటి సంజీవయ్య, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే

క్షణం క్షణం ఉత్కంఠ

- భారీగా తరలివచ్చిన అభిమానులు
- 144 సెక్షన్ అమలు

వెంకటగిరి (సైదాపురం): తప్పుడు కేసుల్లో మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్ట్ చేసి సోమవారం వెంకటగిరి కోర్టుకు తరలించారు. ఈ క్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సోమవారం తెల్లవారు జామునే తన నివాసానికి చేరుకున్నారు. ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సైతం ఇక్కడికి చేరుకుని కాకాణి అక్రమ అరెస్ట్‌ను ఖండించారు. అక్కడి నుంచి నేతలు, కార్యకర్తలు వెంకటగిరి కోర్టుకు బయల్దేరారు. అయితే 144 సెక్షన్ అమల్లో ఉందని, కోర్టు ప్రాంగణంలోకి వెళ్లరాదని పోలీసులు అడ్డుకున్నారు. కొందరు ముఖ్య నేతలను కోర్టు ప్రాంగణంలోకి అనుమతించారు. తర్వాత మాజీమంత్రి అనిల్‌కుమార్ యాదవ్, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే సంజీవయ్యతోపాటు పలువురు ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రముఖులు కోర్టు వద్దకు చేరుకున్నారు.

కిక్కిరిసిన కోర్టు ప్రాంగణం

భారీ బందోబస్తు నడుమ నెల్లూరు నుంచి పోలీసు ఎస్కార్ట్ వాహనంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మధ్యాహ్నం 12.11 గంటలకు వెంకటగిరి కోర్టు ఆవరణానికి తీసుకొచ్చారు. తర్వాత ఆయన్ను న్యాయమూర్తి విష్ణువర్మ ఎదుట హాజరు పరిచారు. సుమారు 3 గంటల పాటు సుదీర్ఘ వాదోపవాదాలు జరగడంతో వెంకటగిరి కోర్టు ప్రాంగణంలో ఉత్కంఠ నెలకొంది. చివరకు మధ్యాహ్నం భోజన విరామం తర్వాత కాకాణికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. భారీ బందోబస్తు నడుమ నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

కొండంత అభిమానం

కాకాణి అక్రమ అరెస్టుతో వెంకటగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలతోపాటు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని సర్వేపల్లి, నెల్లూరు రూరల్, నెల్లూరు సిటీ, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల నుంచి అభిమానులు, నేతలు భారీగా తరలివచ్చి తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. జై జగన్... జై గోవర్ధనన్న అంటూ అభిమానుల నినాదాలు మిన్నంటాయి. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గూడూరు డీఎస్పీ గీతాకుమారి నేతృత్వంలో వెంకటగిరి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అక్రమ కేసులకు భయపడం



మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేసినా భయపడే ప్రసక్తేలేదు. గోవర్ధన్‌రెడ్డిని ఎలాగైనా హింసలకు గురి చేయాలనే కూటమి ప్రభుత్వం అక్రమ మైనింగ్ కేసును బనాయించింది. మైనింగ్ వ్యవహారంలో ఎలాంటి పాత్ర లేని ఆయనపై వివిధ సెక్షన్లపై కేసులు పెట్టి వేధిస్తోంది. ప్రజల పక్షాన నిరంతరం పోరాడే మాజీ మంత్రిపై అన్యాయంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు బనాయించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగానికి తెరదీసి అక్రమ కేసులు ఎలా పెట్టాలో నేర్పిస్తున్నారు. జిల్లా ప్రజలు అంతా కాకాణి వెంటే ఉన్నారు. ఆయనకు మద్దతుగా న్యాయపోరాటం కొనసాగిస్తాం.

– అనిల్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి

కుట్రలపై న్యాయపోరాటం



కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్ట్ పూర్తిగా అక్రమం. ఇది ముమ్మాటికీ కూటమి కుట్రే. ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారం కుట్రలకు తెరలేపింది. కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులు నమోదు బనాయించింది. తమ రాజకీయ ప్రయోజనాల కోసం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. కూటమి అక్రమాలపై ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల గొంతు నొక్కేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది. ఈ కుట్రలపై న్యాయ పోరాటం చేస్తాం.


– డాక్టర్ గురుమూర్తి, తిరుపతి ఎంపీ

అండగా ఉంటాం

కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నించే ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకుల గొంతు నొక్కడం బాధాకరం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలు ఎప్పుడూ లేవు. కాకాణి గోవర్ధన్‌రెడ్డికి మే మంతా అండగా ఉంటాం. న్యాయం గెలిచే వరకు నిరంతరం పోరాటం కొనసాగిస్తాం.

– మేరిగ మురళీధర్, ఎమ్మెల్సీ

తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు



కావలి (జలదంకి): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపించడం కూటమి ప్రభుత్వ వేధింపులకు పరాకాష్టగా నిలుస్తుంది. దీనికి తగిన మూల్యం చెల్లించుకో తప్పదు. కాకాణిని అరెస్ట్ చేయడం అత్యంత హేయమైన చర్య అని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అధికార దుర్వినియోగానికి, దాష్టీకానికి పాల్పడుతుంది. రుస్తుం మైన్స్‌లో ఎలాంటి అక్రమాలు జరగలేదని మైనింగ్ శాఖ జాయింట్ ఇన్‌స్పెక్షన్ నివేదిక ఇచ్చింది. అయినా కక్ష పూరితంగా కాకాణిపై తప్పుడు సెక్షన్లు జోడించి అరెస్ట్ చేయడం దారుణం.

– రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే

పరాకాష్టకు కుయుక్తులు



మైనింగ్ కేసులో ఏ–1, ఏ–2, ఏ–3కి బెయిల్ వస్తే ఏ–4 కాకాణి గోవర్ధన్‌రెడ్డిని దురుద్దేశ పూర్వకంగా జైలుకు పంపారు. ఆయనపై నమోదు చేసిన కేసులో బలం లేకపోవడంతో కక్షపూరిత ధోరణితో ఎస్సీ, ఎస్టీ కేసును నమోదు చేశారు. మైనింగ్‌లో బ్లాస్టింగ్ చేశారని కేసులు నమోదు చేయడం ఆశ్చర్యమేస్తోంది. సైదాపురంలో ఇష్టానుసారంగా అక్రమ మైనింగ్, అక్రమ బ్లాస్టింగ్‌పై కలెక్టర్, ఎస్పీ, ఢిల్లీలోని కేంద్ర మైనింగ్ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లాం. వారిపై చర్యలు తీసుకోకపోగా ఎలాంటి సంబంధం లేని వారిపై తప్పుడు కేసులు బనాయించి జైలు పాలు చేస్తున్నారు.

– నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త

కుట్ర పూరితంగా కేసు

కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేకున్నా అక్రమ మైనింగ్ కేసు నమోదు చేయడం దారుణం. అదే మైనింగ్ వ్యవహారంలో 2023లో విచారణ జరగాక ఎలాంటి అక్రమాలు లేవని అధికారులు ధ్రువీకరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అదే అధికారితో అక్రమాలు జరిగాయంటూ ఇచ్చిన వివరాలతో కాకాణిపై ఏ–4గా కేసు నమోదు చేయడం దుర్మార్గం. కూటమి ప్రభుత్వ తీరుపై జూన్ 4న వెన్నుపోటు దినోత్సవాన్ని నిర్వహించనున్నాం. కూటమి దౌర్జన్యాలు, అరాచకాలు, భూ మాఫియా, మైనింగ్ మాఫియా, దుర్మార్గాలు ప్రజలు దృష్టికి తీసుకెళ్తాం.

– పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ

ఎనిమిది కేసులు

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న కాకాణి గోవర్ధన్ రెడ్డిని టార్గెట్ చేసి కేసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే ఆయనపై ఎనిమిది కేసులు నమోదయ్యాయి.

- గతేడాది గుంటూరు జిల్లా తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ సెంట్రల్ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెడితే ఆ వార్తను 'సాక్షి' పత్రిక కవర్ చేసింది. ఆ పేపర్ కటింగ్‌ను సోషల్ మీడియాలో తన వాట్సాప్ నంబరుతో ఫార్వార్డ్ చేశారని వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేశారు.
- వెంకటాచలం మండలానికి చెందిన బీజేపీ నేత నెల్లూరులో ప్రెస్‌మీట్ పెడితే ఆ వీడియో కాకాణి వాట్సాప్ నంబరుతో ఫార్వార్డ్ చేశారని మరో కేసు నమోదు చేశారు.
- స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డిపై అసభ్యకరంగా పోస్టింగ్ పెట్టారని ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.
- గతేడాది అక్టోబర్‌లో ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేయకపోవడంతో భవన కార్మికులు చేపట్టిన నిరసనలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా కాకాణి వారికి సంఘీభావం తెలియజేస్తూ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారని ఆయనపై దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.
- గతేడాది డిసెంబర్‌లో వెంకటాచలం మాజీ జెడ్పీటీసీ వెంకటశేషయ్యపై స్థానిక పోలీసులు అక్రమ కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ఆ కేసులో పోలీసులే సాక్ష్యాలు తారుమారు చేసిన విషయాలు వెలుగులోకి రావడంతో పోలీసుల తీరుపై కాకాణి ఆగ్రహం వ్యక్తం చేస్తూ తప్పు చేసిన పోలీసులపై మండిపడ్డారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై వెంకటాచలానికి చెందిన టీడీపీ కార్యకర్త వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశారు.
- కావలి నియోజకవర్గం బోగోలు మండలం కొళ్లదిన్నెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు దాడులకు పాల్పడ్డారు. గాయపడిన వారు కావలి ప్రభుత్వాస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న సమయంలో కూడా మరోసారి దాడులకు తెగబడ్డారు. ఆ బాధితులను పరామర్శించిన కాకాణి అక్కడ మీడియాతో మాట్లాడుతూ పోలీసుల పక్షపాత వైఖరిని ఎండగట్టి తప్పు చేసిన అధికారులు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని వ్యాఖ్యలు చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై కొళ్లదిన్నె టీడీపీ మహిళా కార్యకర్తకు బాధ కలిగించిందని ఆమె కావలి వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రాజకీయ కక్షసాధింపే

- పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి



నెల్లూరు (క్రైమ్): కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్ట్ రాజకీయ కక్షసాధింపు చర్యేనని వైఎస్సార్‌సీపీ నేత పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రకారాగారం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాలకోసం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలను ఓ పథకం ప్రకారమే అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారన్నారు. రుస్తుం మైన్స్ కేసులో ఏ–1గా తనను, ఏ–4గా కాకాణి గోవర్ధన్‌రెడ్డిని చేర్చారన్నారు. తాము బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించే నాటికి పేలుడు పదార్థాలున్నట్లు, ఎస్సీ, ఎస్టీ సెక్షన్లు లేవన్నారు. తనతోపాటు శివారెడ్డి, శ్రీనివాసులరెడ్డికి బెయిల్ మంజూరైందన్నారు. ఏదో ఒక రకంగా కాకాణిని అరెస్ట్ చేయాలన్న ఉద్దేశంతో నాన్ బెయిలబుల్ సెక్షన్లు జత చేశారన్నారు.

యోగాపై ఆసక్తికి కృషి చేయాలి

- కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: జిల్లాలోని ప్రజలందరికి యోగాపై ఆసక్తి కలిగించేలా జిల్లా స్థాయి అధికారులందరూ తమవంతు కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపడుతున్న యోగాంధ్ర అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి యోగా ప్రాధాన్యతను, ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు వివరించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. మండల స్థాయిలో నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో అధికారులు పాల్గొని ప్రజలను యోగా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. సుమారు 200 మంది మాస్టర్ ట్రైనర్స్‌కు యోగాసనాలపై శిక్షణ పూర్తి చేశామని, వీరి ద్వారా గ్రామ స్థాయి, వార్డు స్థాయి వరకు ప్రజలను మమేకం చేసుకుంటూ యోగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. యోగాంధ్ర కార్యక్రమాల అమలుకు సంబంధించి జిల్లా స్థాయిలో జిల్లా క్రీడాసాధికార సంస్థ అధికారి యతిరాజ్‌ను నోడల్ అధికారిగా నియమించామని, ఏవైనా సందేహాలు ఉంటే ఆయన్ను సంప్రదించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

కమనీయం.. కామాక్షితాయి కల్యాణం

- నేత్రపర్వంగా తెప్పోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం దేవదేవేరుల కల్యాణం వైభవంగా జరిగింది. అర్చకులు స్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించి కల్యాణ మండపంలో కొలువు దీర్చారు. వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం అత్యంత వేడుకగా నిర్వహించారు. అంతకు ముందు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అమ్మవారికి సారె సమర్పించారు. రాత్రి స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం వేలాది మంది భక్త జనుల నేత్రపర్వంగా జరిగింది. ఏర్పాట్లను ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులరెడ్డి, బ్రహ్మోత్సవ సేవా కమిటీ చైర్మన్ అశోక్‌రెడ్డి పర్యవేక్షించారు.



మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి కల్యాణం



తెప్పపై విహరిస్తున్న ఆదిదంపతులు

ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కారం


ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్ : ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కె కార్తీక్, డీఆర్ఓ ఉదయభాస్కర్‌రావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ విద్యారమ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాల్సన్నారు. ప్రతి అర్జీని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని, చూపించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు చేయాలి


ధర్నా చేస్తున్న మాల ఐక్యవేదిక నాయకులు

విద్యానికేతన్ కళాశాలలో జేమ్స్ అనే విద్యార్థిని కొట్టి మూత్రం తాగించిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలంటూ మాల ఐక్యవేదిక నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గం మల్లాంలో ఓ వర్గం కులస్తులను చంపుతూ వారిని వెలివేయటాన్ని ఖండిస్తూ భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చేయాలన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా మందపల్లిలో ఓ వర్గంపై ఎంగిలి విస్తరాకులు ఎత్తలేదని వారిని కొట్టడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. పాకిస్తాన్ మత ఉగ్రవాదులను ఎప్పుడో ఒక్కసారి కాల్చిచంపుతున్నారని, కానీ భారతదేశంలో ఉన్న కుల ఉగ్రవాదులు ప్రతి రోజు అణగారిన వర్గాల వారిని చంపుతూ, అవమానాలకు గురిచేస్తున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలన్నారు.



తడిగుడ్డతో గొంతు కోశారు


– కలెక్టరేట్ ఎదుట ఎండీయూ ఆపరేటర్ల నిరసన

ఉరిశిక్ష వేసే ఖైదీని కూడా చివరి కోరికను అడుగుతారని, కానీ పౌరసరఫరాల శాఖ మంత్రి, కమిషనర్, మేనేజింగ్ డైరెక్టర్ అందరూ కలసి ఎండీయూ వాహనాలను రద్దు చేసి తడిగుడ్డతో 18,500 మంది కుటుంబాల గొంతు కోశారని ఎండీయూ ఆపరేటర్లు తమ ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేయడాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాఖ్య ఎండీఎస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం గాంధీబొమ్మ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లకు 2027 జనవరి వరకు ప్రభుత్వంతో అగ్రిమెంట్ ఉందని, ఎండీయూ వ్యవస్థ రద్దుతో 9,260 మంది ఎండీయూ ఆపరేటర్లు, అదనంగా 9,260 మంది హెల్పర్లకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. జిల్లా ప్రెసిడెంట్ ఎం.విశ్వనాథ్, వైస్ ప్రెసిడెంట్ ఎం.నాగరాజు, ట్రెజరర్ షేక్ అసిఫ్, సెక్రటరీ మస్తాన్‌వలీ, జాయింట్ సెక్రటరీ షేక్ జమీర్ పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాలను కొనసాగించాలి

రాష్ట్రంలో ప్రతి ఇంటికి రేషన్ అందజేస్తున్న ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం కొనసాగించాలని ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌కె మాబు కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో వినతిపత్రం సమర్పించారు. తొలుత ఎండీయూ వ్యవస్థ ద్వారా రేషన్ పంపిణీ చేసే వాహనాలను ఆపివేయడాన్ని నిరసిస్తూ బోసుబొమ్మ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడు మాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు ఎండీయు వ్యవస్థ ఇంటింటికి రేషన్ పంపిణీ చేసే వాహనాలను నిలిపివేయడం దారుణమన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకుంటే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టపు రంగారావు, ఉపాధ్యక్షులు కొత్తల మధుసూదన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నంబూరు గణేష్, కోవూరు సురేష్, ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి తదితరులు ఉన్నారు.

జిల్లా ప్రాతిపదికన కౌన్సెలింగ్ నిర్వహించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌పీఐ నాయకులు

వైద్యశాఖలో సచివాలయాలకు రిడిప్లాయిమెంట్ చేస్తున్నారని, సీనియార్టీ జాబితా కూడా సిద్ధం చేశారని, ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన రిడిప్లాయిమెంట్ కాకుండా నెల్లూరు జిల్లా వరకు కౌన్సెలింగ్ నిర్వహించే విధంగా చూడాలని వైద్యారోగ్యశాఖ కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నామని, ఇప్పుడు పని చేసే సచివాలయాలతో పాటు పక్క సచివాలయాలను మ్యాపింగ్ చేస్తే వీలుగా ఉంటుందన్నారు. గతంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాకు రావాలంటే తిరుపతి జిల్లా నుంచి ఎన్‌ఓసీ తీసుకురావాలని చెప్పారని, ఇలా కాకుండా ఉండాలంటే నెల్లూరు జిల్లా వరకే కౌన్సెలింగ్ నిర్వహించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

మొత్తం 407 అర్జీలు

ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి 407 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూశాఖవి 133, మున్సిపల్ 17, సర్వే 46, పంచాయతీరాజ్ 16, పోలీసు 52, సివిల్ సప్లయీస్ శాఖవి 31 అర్జీలు అందాయి. ఈ అర్జీలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నిర్దిష్ట గడువులోగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కమిషనర్‌పై కలెక్టర్‌కు కౌన్సిలర్ ఫిర్యాదు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణపై 16వ వార్డు కౌన్సిలర్ ప్రమీలమ్మ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పట్టణంలో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 16 వార్డులో సమస్యలపై అనేకసార్లు వివిధ సర్వసభ్య సమావేశాల్లో తెలిపినా కమిషనర్ నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ సమస్యల పరిష్కారంలో శ్రద్ధ చూపడం లేదని వివరించారు. మార్చి నెల నుంచి వార్డులో తాగునీటి సమస్య, దోమల సమస్య ఎక్కువగా ఉందన్నారు. దీనిపై కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఇటీవల నగర పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న 13మంది పారిశుద్ధ్య కార్మికులను తొలగించారన్నారు. కొత్తగా చేరిన వారిని ఆప్కాస్‌లో చేర్చారన్నారు. దీనిపై ప్రశ్నిస్తే కమిషనర్ తనకు ఎలాంటి సంబంధం లేదని సమాధానమిచ్చారని పేర్కొన్నారు. నగర పంచాయతీలో పన్నుల వలన రూ.కోటి, కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.కోటి ఉన్నా అభివృద్ధి పనుల్లో పక్షపాతం చూపుతున్నారన్నారు. కొన్ని వార్డుల్లో పనులు చేస్తూ మరి కొన్ని వార్డులపై వివక్ష చూపడం సమంజసం కాదని కలెక్టర్‌కు తెలిపారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


మురళి (ఫైల్)

ఇందుకూరుపేట: ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని గంగపట్నం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గడ్లకాలువ సమీపాన ఉన్న గిరిజన కాలనీకి రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో స్థానికంగా ఉన్న పులి మురళి(29) మరమ్మతులు చేసేందుకు విద్యుత్ స్తంభం ఎక్కాడు. ఈ క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకొన్న ఎస్సై నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతునికి భార్య పిల్లలు ఉన్నారు.

భార్య, కుమార్తె అదృశ్యంపై పోలీసులకు భర్త ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): తల్లి, కుమార్తె అదృశ్యమైన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు ఆచారి వీధిలో కిశోర్‌కుమార్ నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, ఏడేళ్ల కుమార్తె ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య అప్పుడప్పుడు హుబ్లీలోని తన పుట్టింటికి వెళ్లి కొద్దిరోజుల అనంతరం తిరిగి భర్త వద్దకు వచ్చేది. ఈనెల 23వ తేదీన కిశోర్‌కుమార్ పనికి వెళ్లారు. ఈ క్రమంలో భర్తకు ఫోన్ చేసి నెల్లూరు రైల్వేస్టేషన్‌లో ఉన్నానని, కుమార్తెను తీసుకుని పుట్టింటికి వెళుతున్నానని చెప్పి ఆమె ఫోన్ పెట్టేసింది. దీంతో భర్త, బంధువులు రైల్వేస్టేషన్‌కు వెళ్లిచూడగా తల్లి, కుమార్తె కనిపించలేదు. హుబ్లీకి ఫోన్ చేసి అడుగగా అక్కడకు రాలేదని తెలిసింది. ఈమేరకు కిశోర్‌కుమార్ సోమవారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆధార్ సీడింగ్‌తోనే సంక్షేమ లబ్ధి

నెల్లూరు రూరల్: ఆధార్ సీడింగ్ చేయించుకోని వారికి పింఛను, సంక్షేమ పథకాల నిలిపివేతకు అవకాశం ఉందని పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్ సీడింగ్, బ్యాంక్ లింకింగ్, ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేయించుకోని పింఛనుదారులకు నగదు చెల్లింపు నిలిపివేసిన విషయం తెలిసిందేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలు, ముఖ్యంగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ పథకాల అమలులో భాగంగా ప్రతి లబ్ధిదారుని బ్యాంక్ ఖాతా ఆధార్‌తో ఎన్‌పీసీఐ ద్వారా మ్యాప్ అయి ఉండాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేయడం జరిగిందని అన్నారు. ఎన్‌పీసీఐ మ్యాపింగ్ పూర్తిగా చేయించుకోని పక్షంలో పింఛను, ఇతర ప్రభుత్వ పథకాల నగదు లభించకపోవచ్చునని, వెంటనే ఐపీపీబీ బ్యాంక్ ద్వారా ఆధార్ మ్యాపింగ్ పూర్తి చేయించుకోవాలని కోరారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.130
లేయర్	రూ.110
బ్రాయిలర్ చికెన్:	రూ.234
స్కిన్‌లెస్ చికెన్:	రూ.260
లేయర్ చికెన్:	రూ.187

మోసపోయాం.. న్యాయం చేయండి


వృద్ధురాలిని వివరాలు అడిగి రాసుకుంటున్న డీఎస్పీ సింధుప్రియ

• పీజీఆర్ఎస్‌కు బాధితుల ఫిర్యాదులు
• తగిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వందమంది తమ సమస్యలను వినతుల రూపంలో నగర డీఎస్పీ సింధుప్రియకు అందజేశారు. వాటిని పరిశీలించిన ఆమె చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు. లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని.....

- నాకు ఆన్‌లైన్‌లో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. విదేశాల నుంచి కిడ్నీ వ్యాధికి సంబంధించిన మందులను తెప్పించి వ్యాధిని తగ్గిస్తానని నమ్మించి రూ.4.90 లక్షలు తీసుకున్నాడు. మందులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడు. విచారించి న్యాయం చేయాలని ఉలవపాడుకు చెందిన మహిళ కోరారు.
- పొదలకూరు ప్రాంతానికి చెందిన జరీనా ఆమె కుటుంబసభ్యులు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.9 లక్షలు తీసుకుని మోసగించారు. వారిపై చర్యలు తీసుకోవాలని నెల్లూరు నగరానికి చెందిన వ్యక్తి కోరారు.
- హైదరాబాద్‌కు చెందిన రామ్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని నా వద్ద రూ.3.60 లక్షలు నగదు తీసుకుని మోసం చేశాడు. విచారించి న్యాయం చేయాలని సంతపేటకు చెందిన ఓ వ్యక్తి కోరారు.
- కావలికి చెందిన జమీర్ పెళ్లిచేసుకుంటానని నమ్మించి సర్వస్వం దోచుకున్నాడు. పెళ్లిచేసుకోమని అడిగితే చంపుతామని బెదిరిస్తున్నాడు. విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కలిగిరికి చెందిన ఓయువతి కోరారు.
- నా భర్త ప్రమాదంలో మృతిచెందాడు. నా అత్త ఈశ్వరమ్మ నా ఇద్దరు పిల్లలను నాకు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతోంది. అడిగితే చంపుతామని బెదిరిస్తోంది. తగిన చర్యలు తీసుకోవాలని నవాబుపేటకు చెందిన మహిళ కోరారు.
- నేను వృద్ధుడిని. నా కుమారుడు ఆస్తి కోసం వేధిస్తున్నాడు. నా బాగోగులు పట్టించుకోవడం లేదు. విచారించి న్యాయం చేయాలని వేదాయపాలెంకు చెందిన వృద్ధుడు కోరారు.
- సింగరాయకొండకు చెందిన శివరామకృష్ణకు రూ.12 లక్షలు విలువచేసే రొయ్యలు అమ్మాను. దాని తాలూకు నగదు ఇవ్వకుండా ఆయన ఇబ్బందులు పెడుతున్నాడు. తగిన చర్యలు తీసుకోవాలని టీపీగూడూరుకు చెందిన ఆక్వారైతు కోరారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయంలో
విలేకరి హల్‌చల్

• డీఎస్పీకి ఫిర్యాదు చేసిన సబ్‌కలెక్టర్

కందుకూరు: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఓ వ్యక్తి సోమవారం హల్‌చల్ చేశాడు. కార్యాలయ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఓ దినపత్రిక (సాక్షి కాదు)కు చెందిన విలేకరి కొండాపురం మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులను తీసుకుని సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాడు. ఆ సమయంలో సబ్‌కలెక్టర్ తిరుమాణి శ్రీపూజ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నారు. దీంతో సిబ్బంది కాసేపు వేచిఉండాలని, తరువాత పంపిస్తామని చెప్పారు. ఆ తరువాత సబ్‌కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌ను ముగించుకుని బయటకు వెళ్లేందుకు సిద్ధమై బయలుదేరారు. దీంతో ఒక్కసారిగా సబ్‌కలెక్టర్ గదిలోకి వెళ్లిన సదరు విలేకరి సబ్‌కలెక్టర్‌తో వాదనకు దిగాడు. మేము వచ్చి చాలాసేపు అయింది. మాకు సమాధానం చెప్పకుండా ఎక్కడికి పోతారంటూ దురుసుగా ప్రవర్తించి మీదకు వెళ్లడంతో, సబ్‌కలెక్టర్ సీసీ, అటెండర్‌లు సదరు విలేకరిని పక్కకు నెట్టేశారు. దీంతో మరింత ఆవేశానికి గురైన ఆ విలేకరి దూషణకు దిగడంతో డీఎస్పీకి సమాచారం ఇచ్చారు. దీంతో పోలీస్ కానిస్టేబుల్ సదరు విలేకరిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జరిగిన విషయాన్ని వెంటనే సబ్‌కలెక్టర్, కలెక్టర్‌తో పాటు, ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. వారి సూచనల మేరకు సదరు విలేకరి దౌర్జన్యంపై ఆమె రాతపూర్వకంగా డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. అదే సమయంలో ఆ విలేకరి కూడా కార్యాలయ సిబ్బంది తనపై దౌర్జన్యం చేసి నెట్టి వేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

బైక్‌పై నుంచి కింద పడి..

• విద్యుత్‌శాఖ ఏఈకి తీవ్రగాయాలు
• మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలింపు


స్ట్రెచర్‌పై తీవ్రంగా గాయపడిన ఏఈ

పొదలకూరు: రోడ్డు ప్రమాదంలో పొదలకూరు విద్యుత్ ఏఈ శ్రీకాంత్ సోమవారం తీవ్రంగా గాయపడ్డారు. పట్టణానికి సమీపంలోని చిట్టేపల్లి తిప్ప వద్ద మోటారు బైక్‌పై వెళుతూ అదుపు తప్పి పడిపోయి తలకు తీవ్ర గాయాలయ్యాయి. పొదలకూరు కార్యాలయంలో సమావేశం నిర్వహించి చేజర్లకు మోటారు బైక్‌పై ఆయన బయలుదేరారు. మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయారు. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. గతంలో శ్రీకాంత్ చేజర్ల ఏఈగా పనిచేసి ఉన్నారు. ప్రస్తుత ఏఈకి పనుల వివరాలు తెలిపేందుకు వెళుతూ ప్రమాదానికి గురయ్యారు. స్థానికులు గుర్తించి ముందుగా పొదలకూరు సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ సమావేశం నేడు

నెల్లూరు(బృందావనం): ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్) సమావేశం మినీబైపాస్‌రోడ్డు మాగుంట లేఅవుట్‌లోని రెయిన్‌బో స్కూల్‌లో మంగళవారం నిర్వహిస్తున్నట్లు నెల్లూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వల్లూరు సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమం జరుగనుందని ఆయన తెలిపారు.

కండలేరు నీటి వివరాలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 41.598 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,880, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే సహించం


గ్రామస్తులతో చర్చిస్తున్న ఎస్సై ఉమాశంకర్

కలిగిరి: గంగిరెడ్డిపాళెంలో ఒక వ్యక్తి అక్రమంగా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేస్తున్నారని గ్రామస్తులు డయల్ 100కు సోమవారం ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. కాల్‌సెంటర్ సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది గ్రామానికి వెళ్లారు. అధికారులు మద్యం దుకాణం నిర్వాహకునికి సహకరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎస్సై ఉమాశంకర్ గ్రామానికి చేరుకుని ప్రజలతో చర్చించారు. పోలీసులు మద్యం నిర్వాహకులకు సహకరించే ప్రసక్తే లేదన్నారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో మద్యం అమ్మకాలు జరుపుతున్నారని ఆరోపణలు ఉన్న వ్యక్తులను పిలిచి బహిరంగంగా హెచ్చరించారు.

బోల్తా పడి స్కూటీపైకి దూసుకెళ్లిన ఆటో


క్షతగాత్రుడ్ని ఆస్పత్రికి తరలిస్తున్న హైవే సిబ్బంది


ప్రమాదానికి కారణమైన ఆటో

• ఇద్దరికి గాయాలు

దగదర్తి: మండలంలోని ఉలవపాళ్ల ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో సోమవారం జాతీయ రహదారిపై కారుని తప్పించబోయి కావలి వైపు వెళుతున్న ఆటో బోల్తా పడింది. ఈ క్రమంలో ముందు వెళుతున్న స్కూటీపైకి దూసుకెళ్లడంతో దానిపై ఉన్న వెంకటప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆటోలోని నలుగురు ప్రయాణికుల్లో ఒకరు గాయపడ్డారు. హైవే మొబైల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హైవే అంబులెన్స్, 108 వాహనంలో క్షతగాత్రులను కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బోల్తా పడిన ఆటోను పక్కకు తొలగించి దగదర్తి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు.